# తల్లి దీవెన

రచన :
శ్రీమతి జానకిదేవి

[మానవుడు ఆశించిన దేదీ నెరవేరదు. కాని ఆశ అనేది పోదు. అది లేకపోతే జీవితమే లేదు. అన్నీ మన మనుకున్నట్లే జరిగితే దేముడెందుకు?]

అది రెండవ ప్రపంచయుద్ధం జరుగుతున్న కాలము. ప్రతిమానవుడు ఆ గడ్డురోజుల్ని యెదుర్కొని జీవిత నౌకను సాఫీగా కొనసాగించగలమా? అని ఆత్రుత చెందుతున్నారు. మహాధనవంతులు సహితము కొట్టుమిట్ట లాడుతూన్న ఆ కాలంలో సామాన్యమైనవారిసంగతి ఎలావుంటుందో వూహించుకోవచ్చు. అటువంటిరోజుల లోనే మన పరంధామయ్యగారుకూడా తన జీవితనౌకను సంసారమనేసాగరములో యీదుతున్నారు.

పరంధామయ్యగారు బడిపంతులుగా ఉద్యోగంచేస్తూ పదేళ్ళ సర్వీసు పూర్తిచేసేరు. వెనుకాముందూ కానీ ఆస్తి లేదు. జానకమ్మ పరంధామయ్యకి అన్నివిధాలా తగిన భార్య. వచ్చేజీతపురాళ్ళన్ని నెలనాడు తెచ్చి భార్య కిస్తారు. ఆమె వుందీ లేదూ అనకుండా గుట్టుతో సంసా రం చేస్తుంది. ఈమధ్య మరీ కష్టంగా వుంది. పెద్దమ్మా యి రాధను పెండ్లిచేసి బాగా చితికిపోయారు. యెంత తక్కువలో చేద్దామన్నా ఈరోజుల్లో కష్టమే. ముఖ్యం గా ఈ కట్నాలపిశాచం ఒకటి. ఎంత చదువుకున్నా, చక్కగావున్నా పిల్లనిస్తామంటే చాలు, ఎంత యిస్తారు అంటూ ప్రశ్న. ఏమిచేస్తాం. ఎదిగినపిల్లను ఎన్నాళ్లు వుంచుకుంటారు. తాహతు లేకపోయినా, ఎక్కడో తల తాకట్టుపెట్టి అప్పు తేవడమూ, పెండ్లిచేయడమూ, తరు వాత అప్పులలో మునిగితేలడము-యిది ప్రతీ ఆడపిల్ల తల్లిదండ్రులు తనుతూన్న బాధే. పరంధామయ్యకు నలు గురు ఆడపిల్లలు, ముగ్గురు మగపిల్లలు. పెద్దమ్మాయి రాధ పెండ్లిచేసి నాలుగేండ్లయింది. మూడువేలు కట్నమిచ్చి మరి చేశారు. తన బంధువులంతా తనకు అంతకట్నమిచ్చి చేయడానికి తాహతులేదూ అని, పోనీ అంత పెద్ద సంబంధమూ అంటే అదీకాదు. వాళ్ళు పరంధామయ్య లాంటివారే. రెక్కాడితేనే రోజు గడిచేది. అలాంటి వాళ్ళుకూడా మరి తక్కువకు చేసుకోకపోతే మరేం చేస్తారు. ఈ కట్నంపుచ్చుకొని వాళ్ళ పాత బాకీలన్నీ తీర్చుకుంటూరు మగపెళ్ళివారు. ఏమైనా కట్నమీయక తప్పదు. మూడువేలు కనీసపు కట్నం. లేకపోతే పిల్లకు మరి పెండ్లికాదు. పాపం, అందుచే పరంధామయ్యకు మూడువేలు ఇవ్వక తప్పిందికాదు. ఏదో పిల్లాడు బి. ఏ. ప్యాసయ్యేడు, ఎక్కడో పదిరాళ్లు తెచ్చుకుంటాడు, తనపెండ్లాన్ని పోషించుకుంటాడు-అని ఆయన అభి ప్రాయము.

'ఏమే! వంటయిందా!' అని అడిగేరు భార్యను.

'ఇదిగో! వడ్డిస్తున్నా, ముందు మీభోజనం కానీయండి. తరువాత ఉన్నవాళ్ళకు వండుతాను' అన్నది జానకమ్మ.

'ఏం?' అన్నారు.

'మరి కోటాబియ్యం లేవుకదూ! ఈవారంకోటా యిప్పుడిస్తారేమో? రామాన్ని పంపుతాను కొట్టుకి.'

'పోనీ ఈపూటకి ఎవరినైనా అడగలేకపోయేవా.'

'మీ పిచ్చిగాని ఎవరిస్తారు? అందరికి వారపుకోటాలే కదా!'

'నిజమే. ఒకవేళ వున్నా ఎవరూ ఇవ్వరు. మనం తీర్చేదెలా? పోనీ నాకు కొంచెం కాఫీ యియ్యి, అన్నం పనివాళ్ళకు పెట్టు' అన్నారు నిట్టూర్చుతూ.

'అదేమిటండీ! మీరు సాయంత్రందాకా రారుకదా, కాఫీత్రాగి ఎలా వెళ్లిపోతారు. నేను తెప్పించి వంట చేస్తాగా అంది కాఫీలోకికూడా పంచదారలేదని చెప్ప లేక. అదిమట్టుకు యెలా వస్తుంది? అదికూడా కంట్రోలే కదా! ఇవన్ని పరంధామయ్యకు తెలీకకాదు. కానీ ఏదో ఒకటి తిని వెళ్ళకపోతే భార్య బాధపడుతుందని ఎలాగో భోజనము అయింది అనిపించేరు.

'ఇదిగో ఈ అయిదురూపాయిలు, మన కొట్టువానితో చెప్తాను, రామాన్ని పంపు. గోధుమలయినా తెస్తాడు' అన్నారు బడికి వెళ్ళుతూ.

భర్త వెళ్ళినవైపే నిరాశతోచూస్తూ నిల్చుండి పోయింది జానకమ్మ. జీవితంలో కొందరికి అనుకున్నవేవీ నెరవేరవు. కొన్ని తలలోకూడా తల్చనివి ఆకస్మాత్తుగా కలిసివస్తూంటాయి. ఇది సృష్టిచిత్రము. తన చిన్ననాడు ఎన్ని కలలుకన్నదీ, తన కలలన్నీ నిజజీవితంలో కలతగా తనయెదుటనే నిల్చిపోయేయి. యెప్పటికైనా తన ఆశలు ఫలిస్తాయా? లేక తనజీవితం ఇలాగే ముగిస్తుందా?

'అమ్మా! నాకు స్కూల్లో మొత్తంమీదఫస్టుమార్కు వచ్చిందని మేష్టరుగారు చెప్పేరమ్మా' అన్న కొడుకు మాటలతో మళ్ళీ యీలోకంలోనికి వచ్చింది.

'ఏమిటి బాబూ!' అంది.

పంపులు MAHENDRA మోటారులు

మీరు ఎక్కువ పంటలు పండించుటకు



మహేంద్ర



(1x5)

పంపులు మరియు మోటారులను అమర్చండి.

"మహేంద్ర" ఎలెక్ట్రిక్ మోటారులు, మరియు సెంట్రిఫ్యూగల్ పంపులు, మోనో బ్లాక్స్, అన్ని సైజులలోనూ లభించును.

వివరములకు

MAHENDRA ENGINEERING WORKS,

6/433, P. N. PALAYAM, ROAD, PULIYAKULAM, COIMBATORE-18.

'నాకు ఫస్టుమార్కు వచ్చిందమ్మా' అన్నాడు రామం. మబ్బులో చంద్రుడిలాగ కాంతిలేని నవ్వు ఒకటి నవ్వింది జానకమ్మ.

'నీకు మంచిమార్కులు రావాలి రామం. నువ్వు పెద్ద పెద్ద చదువులు చదవాలి. మాలా నువ్వవకూడదు. నీ భవిష్యత్ ఎంతో బాగుండాలి. నిన్ను నలుగురూ పొగడాలి. అప్పుడే–అప్పుడే మీఅమ్మ ఆశలు నెరవేరుతాయి. అని ఆవేశంతో అంటున్న అమ్మమాటకు విభ్రాంతితో చూస్తూ నిల్చుండిపోయేడు రామం.

'అమ్మా! ఆకలేస్తుందమ్మా.'

'అయ్యో! నామతి మండిపోను. చూడునాన్నా! మన సెట్టికొట్టుకు వెళ్ళి ఈవారం కోటా వచ్చిందేమో చూడు, అంది' తన మార్కులు అంతటికి ఫస్టువచ్చేనన్న సంతోషముతో ఒక్క పరుగుతీసేడు రామం.

కాలచక్రం మనకోసం ఆగదు. దానిపని అది చేయడమే దానిలక్ష్యం. కాలగర్భంలో మరికొన్ని సంవత్సరములు దొర్లిపోయేయి. రెండవ అమ్మాయికి పెండ్లిచేయడమూ, రామం డక్టరు అవడమూ, పరంధామయ్యగారు ఫించను పుచ్చుకోవడము ఒక్కసారే జరిగేయి. తనకు వచ్చినసొమ్ముతో శశిబాధ్యత తీర్చుకున్నారు పరంధామయ్య. అంతవరకు బాగానేవుంది. తరువాత యీ దుర్ఘటన జరగకపోతే యీకథ యింతతో సమాప్తమయ్యేది. కాని పైన జరిగినసంఘటనల్లన్నీ ప్రతి జీవితంలో సాధారణంగా జరుగుతూనే వుంటాయి.

రామం డాక్టరై రెండుచేతులతోను సంపాదిస్తున్నాడు. జానకమ్మ మనస్సు ఇప్పుడు చల్లపడ్డది. కాని, భగవంతుడు అలా ఎన్నాళ్ళో సాగనీయలేదు. ఇంతలో దుష్టచైనా మనపై దండెత్తడమూ జరిగింది. మనతోటి సోదరులు వేలకువేలు యుద్ధభూమికి ఉరికేరు. వారి ప్రాణరక్షణార్థం యెన్నో ఆస్పత్రులు వారికి ప్రభుత్వం కలుగజేసింది. ప్రతీ డాక్టరునీ, నర్సునీ వచ్చి వారి ప్రాణదానం చేయమనికోరేరు. రామానికికూడా ప్రభుత్వకి

సందేశం వచ్చింది. తనలాంటి యువకుడు దేశమాతకోసం ప్రాణాలుసయితం వడ్డి పోరాడుతున్న తనతోటి సోదరులకు సేవజేసి తనఋణం తీర్చుకుందామని నిశ్చయించుకున్నాడు రామం.

'అమ్మా! నా భవిష్యత్ నువ్వు కోరుతున్నావుకదూ!'

'అదేంటి రామం, అలా అడుగుతావు. నా ఆశలన్నీ, నీ భవిష్యత్తుకే కదా.'

'అందుకేనమ్మా, నాకు ఇప్పుడు మంచి అవకాశం వచ్చింది.'

'ఏమిటి బాబూ?'

'నేను మనసైన్యంలో దెబ్బలు తగిలినవారికి ప్రాణదానంచెయుటకు మిలటరిడాక్టరుగా వెళుతున్నాను.'

'బాబూ! నీవు యుద్ధంలోనికి వెళతావా?' అంది బెదురుతూ.

'యుద్ధానికికాదమ్మా! యుద్ధంలో గాయములు తగిలిన సైనికులకు చికిత్సచేయుటకు వెళుతున్నానమ్మా' అన్నాడు.

'అంటే ఇంచుమించు నీవుకూడా యుద్ధభూమి సమీపానికే కదూ?'

'కొంతవరకూ అంతే.'

'నేను దీనికి సమ్మతించలేను బాబూ.'

'అమ్మా! నీకొడుక్కి పెద్దపేరు రావాలని నీవు కోరుకోలేదా?'

'నిజమే, కాని నిన్ను యుద్ధభూమికి పంపాలని నేనెన్నడూ అనుకోలేదు.




'తల్లీకొడుకు లేమిటో సంభాషిస్తున్నారు' అంటూ పరంధామయ్య వచ్చారు.

'ఏముందీ, మీకొడుకు మిలటరీ డాక్టరుగా వెళతాడట.'

ఎవరూ? మన రామమ్మే!'

'అవునుసాన్న, మాలాంటివాళ్ళమే వెనుకంజవేస్తే ఎలా? ప్రభుత్వంవారు ప్రతి ఆసుపత్రికి వచ్చేవారెవరైనావుంటే రమ్మని సందేశం పంపారు. మీరు అమ్మకు నచ్చచెప్పండి.'

'మనవాడు గొప్పవాడవుతానంటే వద్దంటావా? మనం ఆశించేది అదే కదూ. వెళ్ళనీ అన్నారు పరంధామయ్య.

'ఏమండీ! మీరూ అలాగే అంటారా?'

'నీకు తెలియదు, వాడికేమీ భయములేదు, వెళ్ళనీ అన్నారు. తండ్రి కొడుకులు ఆనందంతో కౌగలించుకున్నారు. జానికమ్మ శిలాప్రతిమలా నిల్చుండిపోయింది.

రామం నేపాలు వెళ్ళిపోయేడు. కన్నకొడుకు వెళ్ళినప్పటినుంచి జానకమ్మ మనస్సు సమితాన్ని కోల్పోయింది. తన బలాన్నంతనీ రామం తనతో తీసికొనిపోయినట్లు అనుకొనేది. ఒక్కొక్కప్పుడు ఏదో ఆలోచిస్తూ కూర్చునేది. ఎంతధైర్యం తెచ్చుకున్నా ఆమెకు మనశ్శాంతి లభించేదికాదు. మనశ్శాంతిలేకుండా మనిషి ఎన్నాళ్ళు జీవించగలడు? జానకమ్మ ఆరోగ్యం దెబ్బతిన్నది. రోజురోజుకూ క్షీణించసాగింది. డాక్టర్లుచూచి టి. బి. అని చెప్పారు.

'ఈవేళ ఎలావుంది నీవంట్లో?' పరంధామయ్యగారి ప్రశ్న.

'ఇంకెలా వుంటుంది? నాకెలావున్నా బాధలేదు. నారామం క్షేమంగావస్తే అంతే చాలు.'

'ఆ! చెప్ప మరిచేను, రామంవద్దనుంచి క్షేమంగా వున్నట్లు ఉత్తరం వచ్చింది.'

'మీరు నాసంగతి వ్రాయలేదా?'

'లేదు. వాడిని గాబరా పెట్టడమెందుకని వ్రాయలేదు.'

'ఒక్కసారి రమ్మని వ్రాయండి.'

'అలాగే! సంవత్సరం అయిందికదూ వెళ్ళి సెలవు లిస్తారు. వ్రాస్తాను' అన్నారు పరంధామయ్య. ఒకప్రక్క భార్యకెలాగ వుంటుందోనని, మరొకప్రక్క కొడుకు క్షేమంగా వస్తాడా అని అతనిహృదయం కొట్టుమిట్టాడుతోంది. కాని తనబాధను వ్యక్తపరిస్తే భార్యయిప్పుడే ప్రాణాలు వదులుతుందని ఆయన భయం. అందుచేత మనసులోనే దిగమ్రింగుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో పిడుగులాటివార్త వచ్చింది. రామం, మరికొందరు డాక్టర్లుకలిసి టిబెట్టుదగ్గరవున్న సైనికులకు

చికిత్స చేయుటకు వెళ్లుచుండగా ఒక మంచులోయలో రామం కాలుజారి పడిపోయి కనిపించలేదు. అన్నవార్త పేపరులో పడింది. అదిచూచి పరంధామయ్య కొయ్యబారి పోయేరు. ఈవార్త తనభార్య కెలాచెప్పడం. చెప్పక చేసేదేముంది. రేపో నేడో తనకొడుకు వస్తాడని వెయ్యి కళ్ళతో యెదురుచూస్తున్న భార్యకు తా నేమనిచెప్పడం? కొడుకుజీవితం సుఖప్రదముగా జరుగునని కలలుగన్న తల్లి తనభార్య' తనభార్య ఆశలు, తన ఆశలు వమ్ముచేసిన ఆ విధిని యేమనాలి? ఈసంగతి తెలిసి జానకి తట్టుకోగలదా? ఏమైనా చెప్పితీరాలి. అందుకే తను బ్రతికివున్నాడు,

'ఏమండీ, అలా వున్నారు? రామం క్షేమమా?' అన్న జానకమ్మ మాటలకు సమాధానం చెప్పకుండా వూరుకున్నారు.

'మాట్లాడరేమండీ? నామనస్సు ఎందుకో ఆందోళనగా వుంది, తొందరగా చెప్పండి' అంది.

'మనరామం మంచులోయలో కాలుజారిపడి కనుపించలేదట.'

'మనరామం కనుపించలేదూ? అయితే ఏమైంది?'

'ఏమీ కాలేదు, వెతుకుతున్నారట,'

'అంటే నారామం లేడన్నమాట!' బాబూ రామం. అంటూ స్పృహతప్పి పడిపోయింది.

స్పృహతప్పి పడిపోయినభార్యకు ముఖంపై నీళ్ళు జల్లి 'చూడు! మనరామం వస్తాడు, నీదీవెన తీసుకుంటాడు, నీ ఆశలు నెరవేరుస్తాడు' అంటూ అంతవరకు తన హృదయంలో దాచుకున్న దావాగ్ని పైకి వెళ్ళగక్కేరు ఆ బడితంతులు.

కొంతసేపటికి జానకమ్మ కళ్లువిప్పి చూచింది. కాని మనచూపు కాదు. నారామం వస్తాడు. చిరంజీవిగా వుంటాడు. ఎన్నటికీ కనబడకుండా పోడు. బాబూ రామం నీవు చిరంజీవివి. నీ అమ్మ ఆశయాలు నెరవేర్చెవుద్దేశంతో మాతృదేశ రక్షణకొరకు తోటిసోదరులను కాపాడడానికి వెళ్ళేవు. నీకు ఏ ఆపద రాదు. బాబూ నేను ఎచ్చటవున్నా, నాదీవెన నీకు ఎప్పుడూ వుంటుంది. నీజీవితం సుఖప్రదముకావాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. అంటూ ఈ వుత్తరం బాబుకీయండి అని ఒక కాగితం భర్తచేతిలో పెట్టింది. అంతే, ఆమాత్రుమూర్తి మరి లేదు.

మరొకవారం రోజులలో, రామం బ్రతికి, దేశానికి, తనసాటి సోదరులకు ప్రాణదానం చేసినందుకుగాను పద్మశ్రీ బిరుదునిచ్చి సత్కరింపబడినట్లు, తమదేశానికి వస్తున్నట్లు టెలిగ్రాం వచ్చింది.

ఆ టెలిగ్రాంచూచి పరంధామయ్య భార్య ఫొటో వైపుకు వెళ్ళేరు.

'జానకీ! నీరామం వస్తున్నాడు. నీ ఆశలు ఫలించేయి, చూడు' అంటూ కండ్లనీరు పెట్టుకున్నారు.

'నాన్నా! నేను వచ్చాను. అమ్మ ఏదీ?' అన్న రామం పిలుపువిని నిశ్చేష్టులయ్యేరు పరంధామయ్య.

తల్లి ఫోటోకువున్న పూలమాలనుచూచి రామం 'అమ్మా!' అంటూ తల నేలకేసి బాదుకున్నాడు.

వెనుకనుంచి ఒకహస్తం ఒకలేఖను అందించింది. 'తే, నాయనా! మీ అమ్మ సందేశం చూడు బాబూ' అంతదుఃఖము దిగమ్రింగి అమ్మ వ్రాసిన ఉత్తరం చదువుకున్నాడు. కండ్లవెంట అశ్రుధారలు కారుతూనే వున్నాయి.

'అమ్మా! నీదీవెనలే నన్ను కాపాడింది. లేదు నీవు చనిపోలేదు. నామనస్సులోనే వున్నావు.'

నాన్నా! మన అమ్మ మన యింటనే ఉన్నది. అంటూ తండ్రిహృదయంమీద వాలిపోయేడు రామం. ఆ తండ్రి


ఆరోగ్య సౌభాగ్యములకు మహిళలు
ఆధారపడునవి ఆరోగ్య అనారోగ్య
పరిస్థితులలో
లోధ్ర
♦
గర్భపోషణకు, సుఖప్రసవమునకు
గర్భరక్షక
♦
వేవిళ్ళకు, మలబద్ధకమునకు "మాధీఫల"
రసాయనం
♦
ప్రసవానంతరం బలమునకు క్షీరవృద్ధికి
సౌభాగ్యశొంఠి
♦
68 సంవత్సరములకు పైగా
ప్రశిద్ధినొందిన ఔషధములు.
కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్.
మదరాసు–14.
ఏజెంట్లు:
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)
విజయవాడ.